# అంతర్వాహిని

"ఒరేయ్ కోటీ" కోటిగాడు తనవేపు చూడ్డం చూసి "ఇట్రా ఇట్రా" అని పిలిచాడు బస్సు డ్రైవర్.

"ఒరే కోటిగా ఇట్రారా... రారా..." అని కేకేసి పిలిచాడు కండక్టరు.

గొంతు చించుకుని అరుస్తేనేగాని పిలుపు వినిపించటంలేదు. వర్షంమోత అంత పెద్దగా ఉంది. బస్టాండు చుట్టూ ఉన్న పట్టణాన్ని కప్పేసేటంత దట్టంగా ఉన్నాయి వర్షపు తెరలు. ఏడాది పొడువునా రోడ్లమీద పేరుకున్న మురికినంతా పావుగంటలో కడిగేసింది వర్షం. సైడు కాలువలు పొంగిపోయాయి రోడ్డుమీదికి. రోడ్లనిండా వర్షపు నీళ్లు మురిగ్గా పారుతున్నాయి.

బస్టాండు దగ్గర్లోనే పెద్ద మర్రిచెట్టుంది. సగం తడిసిన కోటి ఆ మర్రిచెట్టుమాను చాటున నుంచున్నాడు. అక్కణ్నించి కదిలి డ్రైవరూ, కండక్టరూ ఉన్న ప్రయాణికుల షెడ్డులోకి వెళ్లాలంటే మొత్తం తడిసిపోతాడు. కండక్టరు పిలుపూ వినబడ్డది, డ్రైవర్ పిలుపూ వినబడ్డది. ఆ పిలుపులు విని వాళ్లవేపు చూశాడు కూడా. కాని మర్రిచెట్టు కిందినించి కదల్లేదు.

బస్టాండుకు ఆనుకునే పశ్చిమంగా పాతకాలపు విశాలమైన హోటల్ ఉంది. అక్కడనించి హోటల్ యజమాని కృపాసింధు "ఒరే వెధవా తడుస్తున్నావ్ రారా" అని

ప్రేమతో పిలిచాడు.

కృపాసింధు వేపుకూడా చూశాడు కోటి. కాని ఆ చెట్టుచాటునించి కదల్లేదు. అటు బస్టాండుకు దక్షిణంగా ప్రయాణీకుల షెడ్డు. ఇటు హోటలు. రెండూ పాతిక గజాలు దూరంలోనే ఉన్నాయి. వర్షం కుండపోతగా కురుస్తున్నది. ఆ వర్షంలో కదిల్తేచాలు తడిసి ముద్దయి పోయేట్టు ఉన్నాడు. అందుచేత కదల్లేదు.

వాడికి మనుషులంటే భయం. వాళ్ల దగ్గరకు వెళ్లాలంటే భయం. అందువల్ల ఆ భయంతోనే ఆ చెట్టుమాను చాటున, వర్షం తుంపర్లలో తడుస్తూ వర్షాన్ని చూస్తూ నుంచున్నాడు.

హోటల్‌లో వెచ్చని కాఫీ చప్పరిస్తున్న సారథి, కోటిని చూశాడు. తన స్నేహితుడు రామ్మూర్తి గుర్తొచ్చాడు. కోటి తమ్ముడే రామ్మూర్తి. ఆ రకంగా కోటితో పరిచయం కూడా ఉంది సారథికి. గత నాలుగయిదేళ్లలోనే కోటి బతుకు శిథిలమయిపోయింది. పెళ్లాం చచ్చిపోయింది. కొడుకు చచ్చిపోయాడు. కోటి బతుకు రోడ్డు పాలయింది. ఇప్పుడు బస్టాండు అతడికి దిక్కయింది. ఒకప్పుడు బస్సు కండక్టర్ కోటి, ఇప్పుడు...

కోటికి తల్లి ఉంది. అన్నయ్య ఉన్నాడు. వదినె ఉంది. తమ్ముడున్నాడు. వాళ్ల కుటుంబాలు ఉన్నాయి. అయినా వాళ్లతో పడదు. ఇంటివేపు అసలు వెళ్లడు. పిలిచి తీసుకుపోయినా ఒకపూట తప్ప ఉండడు. కోటికి ఆ ఇల్లంటేనే భయం. అక్కడ అడుగుపెట్టటం అంటేనే భయం. దుఃఖం ముంచుకొస్తుంది. పెళ్లాం గుర్తొస్తుంది. కొడుకు గుర్తొస్తాడు. వాళ్లు గుర్తొస్తే ఏడుపు. ఆ ఏడుపు...

పిలిచి పిలిచి విసిగిపోయాడేమో కండక్టర్ "ఒరే దున్నపోతూ, రారా" అన్నాడు పళ్లుకొరికి.

అదేషెడ్డులోంచి "తడిచ్చస్తున్నా వ్వెధవా, బుర్రలేదూ, ఇక్కడకొచ్చి చావకూడదూ" అన్నాడు డ్రైవర్. ఈసారి డ్రైవర్‌కి కోపమొచ్చింది. తమమాట విని కోటి షెడ్డులోకివస్తే తడవడుకదా అని అతడి ఉద్దేశ్యం. వర్షం ఇప్పుడప్పుడే తగ్గేట్టులేదు. ఆ చెట్టుమాను చాటున చిన్నగా కోటి తడుస్తూనే ఉన్నాడు. అది చూసి డ్రైవర్ బాధపడ్డాడు.

క్లీనర్ ఒంటికన్ను నర్సింగులు వర్షపుజల్లులకి తడిసిపోయి నుంచున్న కోటినిచూసి ఒకటే పగలబడి నవ్వుతున్నాడు.

ఆ వర్షానికి షెడ్డులో చేరిన ప్రయాణీకులు తమతమ బస్సుల రాక కోసం ఎదురుచూస్తున్నారు. వాళ్లలో మగాళ్లు బలంగానూ, మోటుగానూ ఉన్నారు. వాళ్లలో ఓ పెళ్లిబృందం ఉంది. పెళ్లికూతురూ, పెళ్లికొడుకూ ఇంకా పెళ్లి బట్టల్లోనే ఉన్నారు.

పేదవాళ్లలా ఉన్నారు. అయినా ఏ లోటూ ఎరగనంత తృప్తిగా, సంతోషంగా ఉన్నారు.

అంతలో ఓ ఆడకుక్క ఎక్కణ్నించో బాగా తడిసి తలదాచుకోవటానికి షెడ్డు లోపలికి వచ్చింది. అనారోగ్యంగా ఉన్నట్టుంది. ఊగుతూ నడుస్తున్నది. దాన్ని లోపలికి రానిచ్చి బూటుతో తన్నాడు డ్రైవర్. అది ఆ తాపుకు అంత దూరంలో వర్షంనీళ్లల్లో పడింది. షెడ్డు గోడనించి ఊడుతున్న ఇటికపెళ్లని తీసి దాన్ని చావమోది, అది దిక్కులేని ఆక్రందనతో పరుగుతీస్తే అంతా నవ్వి ఆనందించారు. ఆ కుక్క 'కుయ్యో మొర్రో'మంటూ హోటల్‌వేపు పరుగు తీయటం చూసి తననే హింసిస్తున్నట్టుగా బాధపడ్డాడు మర్రిచెట్టు మాను చాటున చిన్నగా తడుస్తున్న కోటి.

"ఒరే దున్నపోతూ, గాడిదా, తడిసి జొరంతెచ్చుకుంటావ్. రారా షెడ్డులోకి" అని మరోసారి పిలిచాడు కోటిని కండక్టర్, కోప్పడుతున్న గొంతుతో.

వాళ్ల బస్సు వర్షంలో తడుస్తున్నది. ఏడెనిమిదిమంది ప్రయాణీకులు ఆ బస్సులో ఉన్నారు. బస్సు కదలటానికి ఇంకా అర్ధగంట టైం ఉంది. ఈ అర్ధగంట కాలక్షేపం కోసం కోటిని వాళ్లు పిలుస్తున్నారు తప్పించి వాడిమీద అంత సానుభూతి ఉండికాదు. తను ఆడించినట్టల్లా ఆడితే మనిషి పొందే ఆనందం చాల గొప్పది. చేపపిల్లని ఒడ్డున ఇసికలోవేసి అది గిలగిల కొట్టుకుంటుంటే చూడటం చాలా ఇష్టం. తూనీగకు దారం కట్టి వొదిల్తే అది ఆకుల్లోనో, మొక్కల్లోనో చిక్కుకుని గిలగిల తన్నుకోవటం చూస్తే సరదా. ఎలక్కి మువ్వకట్టి అది ఆ చప్పుడుకు విలవిల లాడుతుంటే చూడడం చాలా సంతోషం. కుక్క ముఖాన్ని కుండలో పెట్టి వొదిలి అది వెర్రిపరుగులు తీసి పడిపోతుంటే చూడటం భలే ఆనందం. మరి తాను ఆడించినట్టల్లా ఆడే మనిషి దొరికితే పొందే ఆనందం గురించి వేరే చెప్పనక్కర్లేదు. కోటితో ఆడుకోవాలని వాళ్ల సరదా ఇప్పుడు. దానికోసమే వాళ్లు ఇప్పుడు కోటిని పిలుస్తున్నారు. ఆ సంగతి కోటికి తెలుసు. అది తెలిసే కోటి వాళ్లు ఇంతగా పిలుస్తున్నా వాళ్ల దగ్గరకు పోవటం లేదు. రాకుండా ఉంటే ఊరుకోరు, వెళ్లి లాక్కొస్తారు.

ఆ బస్ స్టాఫ్ వాళ్లంతా అప్పుడే అదే హోటల్‌లో అన్నం తిన్నారు. కిళ్లీలు, సిగరెట్లు మొదలయ్యాయి. వచ్చి షెడ్డులో కూర్చున్నారో లేదో ఈ కుండపోత వర్షం...

అప్పుడే ఓ బస్సు వచ్చి ఆగింది. ఆ బస్సునించి ప్రయాణీకులు పది పన్నెండు మంది అక్కడ ఆ వర్షంలోనే దిగారు. కొందరు లోపలికి షెడ్డువేపు వచ్చారు. షెడ్డులో ఈ బస్సుకోసం చూస్తున్న ముగ్గురు ప్రయాణీకులు వర్షంలో తడుస్తూనే బస్సులోకి వెళ్లారు. షెడ్డులోకి బస్సు దిగివచ్చినవాళ్లలో ఒకాయన దగ్గర గొడుగు ఉంది.

బస్సులోంచి దిగిన ఒక ఆడమనిషి — పాతికేళ్లుంటాయేమో — బరువైన బెడ్డింగ్‌తోనూ, చేతిలో సూట్‌కేస్‌తోనూ దిగింది. ఆ సమయానికి బస్సులో ఆమె

వస్తున్నట్టు భర్తకి రాసింది. కాని వాళ్లెవరూ కనిపించలేదు. చుట్టూ వెతికి చూసింది భర్త అక్కడ ఉంటాడని ఆశతో. ఆయనగాని ఇంటివాళ్లుగాని కనిపించలేదు. దగ్గర్లో ఎవరూ కూలీలు లేరు. ఆమె అటూ ఇటూ సహాయపడే మనుషులకోసం చూసింది. ఎవరి సందడిలో వాళ్లు... వర్షంలో తడుస్తూ తలదాచుకోవటానికి పరుగుతీస్తున్నారే తప్ప ఆమెని ఎవరూ పట్టించు కోవటంలేదు.

"నర్సింగులూ, ఆ బాబు దగ్గర గొడుగు అడిగి తీసుకుని, ఆ ఆడమనిషి తడిసిపోతున్నాది. ఎల్లి సాయం చెయ్యరా. ఆ బెడ్డింగ్ తడిసిపోతున్నాది." అని సలహా ఇచ్చాడు కండక్టరు. ఆమె మొత్తంగా తడిసిపోయి కట్టుకున్న బట్టలు ఒంటికి అతుక్కున్నాయి.

కండక్టరు గొంతులో వ్యంగ్యం అర్థమై నర్సింగులు పట్టించుకోలేదు. ఏ ఆట ఆడమంటే ఆ ఆట ఆడేరకం కాదు నర్సింగులు. కావలిస్తే వాళ్లతోపాటు ఎవరినన్నా ఆడించటంలో వెనకాడడు. ఆ పాతికేళ్ల ఆడమనిషి వర్షంలో తడిసిపోతున్న నిస్సహాయస్థితి చూసికూడా నర్సింగులు వెళ్లి సాయం చెయ్యలేదు. ఆమె మొత్తం తడిచిపోయింది. ముందు ఆ బెడ్డింగ్‌ని మోసుకుని హోటల్ పంచన పెట్టి వచ్చి, కింద నీళ్లల్లో పెట్టిన సూట్‌కేస్‌ని తర్వాత తీసుకుపోయింది. అలాంటి సమయాల్లో మాములుగా నర్సింగులు సాయం చేసే మనిషే. కాని కండక్టర్ వ్యంగ్యం మూలంగా హీ హీ హీ అని నవ్వేసి వాడు కదల్లేదు.

'నర్సింగులూ, ఆ బాబు దగ్గర గొడుగు తీసుకుని వెళ్లి కోటిగాడిని తీసుకు రారా' అని సలహా ఇచ్చాడు మరోసారి కండక్టరు.

ఆ ప్రయాణీకుని దగ్గర అడిగి గొడుగు తీసుకుని నర్సింగులు మర్రిచెట్టు దగ్గరకు వెళ్లాడు. నర్సింగులును చూసి కోటి జంకి వెనక్కి అడుగువేశాడు. గొడుగు చూపించి పిలిచేసరికి కోటి గొడుగు క్రిందికి వచ్చాడు. ఇద్దరూ షెడ్డువేపు నడుస్తున్నారు. మధ్యవరకూ తీసుకువెళ్లి అక్కడ వర్షంలో కోటిని వదిలేసి, గొడుగుతో నర్సింగులు షెడ్డులోకి పరుగుతీశాడు.

వర్షం కుండపోతగా ఉంది.

కోటికి కోపమూ, ఏడుపూ వచ్చింది. బూతులు తిట్టాడు నర్సింగులుని. పట్టుకుని తన్నాలని వెంటబడ్డాడు.

"తగ్గరా కోటీ తగ్గు"

"తగ్గరా"

"ఓరి నీకోపం మండా! వరదలా ముంచుకొచ్చిందిరా!"

"సచ్చిపోతన్నాన్రా — ఎదవ — ఏమయిపోయిందిరా — ఇంతసేపూ నానేవు

కాదూ, ఇప్పుడు మొక్కయిపోతావా?"

'కోటీ, నీళ్లు పోసుకుని ఎన్నాళ్లయిందిరా — ఎల్లి ఆ వోనల ఒక నిమిసం తడు... కుళ్లొదిలిపోతాది... వొంటికి పట్టిన కుళ్లొదిలిపోతాది. వొళ్లు సల్లబడతాది' లోపలికి వస్తున్న కోటిని ఐదారు చేతులు వర్షంలోకి నెట్టాయి.

కోటికి వొళ్లుమండింది. ఆ కోపంలోనే వాడికి ఏడుపుకూడా వచ్చింది. దాంతో ఏడ్చాడు.

వర్షంలోనే వాడు వాళ్లమీద కోపంకొద్దీ నుంచున్నాడు. వర్షంలో నాని పోతున్నాడు. ముందుకు రాలేదు. వెనక్కిపోలేదు. అక్కడే వర్షంలో రాయిలాగ నిలబడ్డాడు.

షెడ్డుముందు జరుగుతున్న దృశ్యం వర్షపు తెరల్లోంచి చూస్తున్నారు హోటల్‌లో వాళ్లు.

"కోటీ, ఈ చెప్పు కడిగేయరా, నాయన్నాయన, ఎలాగూ తడిశావుకదా" అని కండక్టర్ తన కాలిచెప్పును తీసి కోటికి తగలాలన్నట్టుగా విసిరాడు. విసుర్తూ వినోదించి నవ్వాడు. ఆ చెప్పుకు అంటుకున్న బురద కాస్తా కోటి తొడుక్కున్న తడిసిన చొక్కాకు అంటుకుంది.

ఇదికూడా అని రెండో చెప్పుకూడా విసిరాడు కండక్టర్.

కోటి కుండపోత వర్షంలో తడుస్తుండటం వాళ్లకి వినోదంగా ఉంది.

కళ్లల్లోని కన్నీళ్లవల్లా, వర్షం ముఖంమీద కురుస్తుండడంవల్లా ఆ రెండోచెప్పు తనమీదికి రావడం కనిపించలేదు కోటికి. ఆ చెప్పువచ్చి ముఖం మీద గట్టిగానే తగిలింది.

కోటి ఆ రెండు చెప్పులూ అందుకుని దూరంగా తన బలం కొద్దీ విసిరేశాడు.

'నర్సింగులూ, కోటిగాడు ఆ చెప్పులు యిసిరేసినాడ్రా. హైస్కూల్లో పడినట్టున్నాయి. ఎల్లి తీసుకురా. ఎక్కడ పడ్డాయో. దొరుకుతాయో, దొరకవో.'అని కండక్టరు నర్సింగుల్ని చెప్పులు వెతికి పట్టుకురమ్మని పంపించాడు.

నర్సింగులు ఎందుకు నవ్వుతున్నాడో తెలీదుకాని నవ్వుతూనే గొడుగేసుకుని రోడ్డుకు తూర్పుగా ఉన్న హైస్కూల్ కాంపౌండ్ వేపు వెళ్లాడు.

బస్టాండ్‌లో జరుగుతున్న ఈ అల్లరినంతా సారథి హోటల్లోంచి చూస్తున్నాడు. ఎందుకలా వాడిని హింసిస్తున్నారు, రాక్షసంగా అనుకున్నాడు.

అవును కోటీశ్వరరావే అతడు. ఇప్పుడు బస్టాండ్ బతుకయి పోయింది. కండక్టర్ కోటీశ్వరరావు తనకు సన్నిహితంగా తెలుసు. భార్య పోయినప్పటినించీ అతడు ఉద్యోగానికి వెళ్లటం మానేశాడు. ఇంటికి రావటం మానేశాడు. కొడుకు

చనిపోయిన తర్వాత అతడు... చాలాకాలం ఏమయ్యాడో తెలీదు. ఇప్పుడు మళ్లీ కన్పిస్తున్నాడు.

స్నేహితుడు రామ్మూర్తి ట్రెజరీ ఆఫీస్‌లో గుమస్తా. గౌరవంగా బతుకుతున్నాడు. అన్నయ్యను పోషించుకోగలడు. మర్యాదగా బతుకు సాగించుకోవచ్చు. ఎప్పుడన్నా బలవంతంగా ఇంటికి తీసుకువెళ్తే —ఒక్కరోజే ఇంట్లో... మళ్లా ఎటువెళ్తాడో తెలీదు. ఏ లారీ డ్రైవర్‌తోనో, ఏ కండక్టర్‌తోనో, వాళ్ల బండిమీద, వాళ్లతో — ఎక్కడ ఉంటాడో తెలీదు.

వాళ్లుకూడా అలవాటు పడ్డారు. విసిగిపోయారు. ఆ కథంతా గుర్తొచ్చింది సారథికి.

తానే వెళ్లి కోటేశ్వరరావూ అని పిలిచి పలకరిస్తేనో...

కోటిగా బతకడమే ఇప్పుడు కోరుకుంటున్నాడా? ఈసారి రామ్మూర్తి కలిసినప్పుడు చెప్పాలి. ఫలానా ఊళ్లో బస్టాండులో మీ అన్నయ్య కోటీశ్వరరావు కన్పించాడు అని. అంతకన్నా ఏం చేయగలడు. కోటి మళ్లీ కోటేశ్వరరావు కాలేడా? వయసు ముప్పయి అయిదేళ్లుకూడా ఉండదేమో. మళ్లీ పెళ్లి చేసుకోవచ్చు. మళ్లీ పిల్లల్ని కనొచ్చు. మళ్లీ సంసార జీవితం సాగించవచ్చు. ఆ దార్లో ఎవరూ పెట్టలేరా?

కోటి గొణుక్కుంటూ తిరిగి మర్రిచెట్టు కిందకి వెళ్లిపోయాడు. అక్కడ తడిసిన తన చొక్కాని పిండుకున్నాడు. పాదాల వరకూ ఉన్న ఫేంట్‌ను మోకాలివరకు మడత పెట్టుకున్నాడు. పిండిన చొక్కాతో ఒళ్లు తుడుచుకున్నాడు. దిక్కులేని చూపులతో, వర్షానికి లెక్కచెయ్యకుండా ఆ చెట్టు చాటునే నుంచున్నాడు.

అంతకుముందే హోటల్ పంచకు సూట్‌కేస్ బెడ్డింగ్‌లతో చేరిన ఆ ఆడమనిషి దృష్టిలో కోటితో కండక్టర్, డ్రైవర్, క్లీనర్‌లు ఆడుకుంటున్న దృశ్యం పడింది. కోటి తనకు తెలిసిన మనిషిలాగానే ఒక్క క్షణం పాటు అన్పించింది. ఎక్కడో చూసినట్టుగా ఉంది. ఎవరు, ఎవరు అని వెతుక్కోసాగింది.

రిక్షాకోసం వెతుక్కుంటున్న ఆమె చూపులకు కోటి మాత్రమే కన్పించడం ఆమెకు విచిత్రంగా ఉంది. మనుషులు ఎంత దుర్మార్గంగా తయారవుతున్నారో కదా. తను బస్సు దిగినప్పుడు కింద బెడ్డింగ్ అందుకునే సహాయదృష్టి కూడా ఎవరికీ కలగలేదు. అంతా ఎవరి పరుగులు వాళ్లవే. తనకోసం ఆ సమయానికి అక్కడికి రావలసిన ఇంటి మనుషులు సైతం రాలేదు. రిక్షాలేదు. కూలీలేదు. దానికితోడు కుండపోతగా వర్షం. తడిసిన తన శరీరాన్నే అంతా చూస్తున్నట్టని పించి ఆమె మరింత సిగ్గుపడిపోయింది. అందరు మనుషులుండి కూడా తోటివారికి సహాయం చెయ్యలేని పరిస్థితి చూసి, ఆ మనుషులే కోటిని ఆటపట్టించి హింసించడం చూసి, కోటిమీద

ఆమెకి సానుభూతి కలిగింది.

హోరున కురుస్తున్న వర్షం మరింత ఉధృతం అవుతున్నట్టుంది.

కోటి వొంటిమీద చొక్కాలేదు. మనిషి ఆరోగ్యంగా ఉన్నట్టుకూడా కన్పించడం లేదు. చిన్నవాడిలాగానే కన్పిస్తున్నాడు. ఎందుకో ఇంత దిక్కులేని స్థితి. పెళ్లాం పిల్లలు... ఇట్లాంటి వాళ్లకా? తల్లీ తండ్రీ లేరా? అన్నా తమ్ముడూ, అక్కాచెల్లెలూ — ఎవరూలేరా? ఏమీలేదా? ఎలా బతుకుతారో ఇట్లాంటివాళ్ళు? తిండి ఎలాగో, నిద్రెక్కడో, ఎవరు ఏంపెట్తారో, ఎలా బతుకుతున్నారో, ఎవరు ఓదారుస్తారో! ఏమిటో ఇలాంటి బతుకు... అనుకుందామె. అంతలోనే వాళ్లాయన సకాలంలో బస్సుదగ్గర తనకోసం వచ్చి ఎదురుచూడనందుకు — ఇంటివాళ్లమీద — ముఖ్యంగా భర్తమీద కోపం వచ్చిందామెకు.

సారథికి మనసు ఊగిసలాడుతున్నది. వెళ్లి పలకరిస్తే తనని గుర్తుపట్టాడా? వెళ్లి తనతోపాటు హోటల్‌లోకి తీసుకువచ్చి, వెచ్చవెచ్చని టీ తాగించాలనిపించింది సారథికి.

నర్సింగులు చెప్పులు రెండూ పట్టుకుని, గొడుగు ఉన్నా వర్షపు ధాటికి తడిసిపోయి, షెడ్డులోకి చేరుకున్నాడు. నవ్వుతున్నాడు. 'ఎక్కడపడ్డా యనుకున్నావ్? స్కూల్ వరండాలో ఒకటి, జండాకొయ్యకాడ ఒకటి' అని వాడినవ్వు.

'నర్సింగులూ, తడిసిపోయావురా' అని కండక్టర్ జాలిపడి, 'ఆ ఎలాగూ తడిశావుగదా గొడుగు ఆ బాబు కిచ్చేసి, దొంగ చాటుగా యెల్లి, ఆ పిండుకున్నాడు చూడూ — ఆ చొక్కా పట్టుకొచ్చీ' అని మరొక సిగరెట్ వెలిగించాడు డ్రైవర్.

కోటి హోటల్‌వేపు ముఖం చేసి చెట్టుమాను చాటుగా నుంచోవడం వల్ల దక్షిణంగా ఉన్న షెడ్డునించి వెళ్లిన నర్సింగులును గమనించలేదు. నక్కినక్కి వెళ్లి నర్సింగులు, కోటి చేతుల్లో ఉన్న పిండుకున్న చొక్కాను గద్దలా ఎత్తుకుపోయాడు. నర్సింగులు వెంబడే కోటి తెగించి పరుగెత్తడమూ, వర్షంలో తడిసి ఆ ఇద్దరూ షెడ్డు చేరుకోవడమూ, నర్సింగులు తన చేతిలోని చొక్కాని కండక్టర్ చేతిలో పెట్టి డ్రైవర్ చాటున నుంచోవడమూ, తిట్టుకుంటూ డ్రైవర్‌ని ఓ పక్కకు నెట్టేసి 'ఎముకలు చితగ్గొడతా నుండు గుడ్డివెధవా దొరక్కపోతావా? డ్రైవరూ రక్షించలేడు, ఆ కండక్టరూ రక్షించలేడ్రా — ముందు చొక్కా యివ్వరా' అని కండక్టర్ మీద పడడమూ, కండక్టర్ చొక్కాని డ్రైవర్ చేతిలోకి విసురుతున్నట్టుగా నటించి బైటికి వర్షం బురదనీట్లోకి విసిరేయటమూ కళ్లు మూసి తెరచినంతలో జరిగిపోయాయి.

హోటల్ పంచన నుంచున్న వర్షంలో తడిసిపోయిన ఆ ఆడమనిషి ఈ ఆటంతా చూస్తున్నది. కోటీశ్వరరావు పేరు గుర్తురాకపోయినా రూపం గుర్తొస్తున్నది. తన

స్నేహితురాలు పార్వతి భర్త కదా! అటు షెడ్డులో డ్రైవరూ, కండక్టరూ, ఈ ఒంటి కన్నువాడూ అంతా వినోదిస్తున్నారు. కొందరు ప్రయాణీకులుకూడా వినోదిస్తున్నట్టే ఉన్నారు. ఆమెకు మాత్రం చాలా బాధ అన్పించింది.

కోటికి ఎంత కోపమొచ్చిందో మరి 'ఇదిగో యీ పేంట్ కూడా విసిరేయండ్రా' అని పేంట్ బొత్తాములు విప్పేయబోయాడు.

'విప్పరా విప్పరా' అన్నాడు నర్సింగులు. కుక్క దెబ్బ తగిలి, కుయ్యో మొర్రోమని ఏడుస్తుంటే చూసి నవ్వినట్టే అక్కడున్న కొంతమంది భలే వినోదం అన్పించి నవ్వారు.

కోటి ఈసారి ఏడ్చేశాడు. దుఖ్ఖం ఆపుకోలేకపోయాడు. ఆ చొక్కాను నీళ్లలోంచి తీసి పట్టుకుని మర్రిచెట్టుకిందికి వెళ్లిపోయాడు.

వర్షం హోరున కురుస్తూనే ఉంది.

అంతలో ఓ రిక్షా వచ్చింది. ఇద్దర్ని హోటల్ దగ్గర దించింది. ఆ ఆడమనిషినీ, ఆమె బెడ్డింగ్‌నీ, సూట్‌కేస్‌నీ ఎక్కించుకుని వెళ్లిపోయింది.

ఐదు నిమిషాలు గడిచాయి. కోటీ మళ్లీ చొక్కా పిండుకున్నాడు. వొళ్లు తుడుచుకున్నాడు. తల వొత్తుకున్నాడు. చాలసేపటినించి నుంచోవటంవల్ల కాళ్లునొప్పులు. అయినా మర్రిచెట్టుమాను చాటున అలసటతోనే నుంచున్నాడు.

'బాబూ, గొడుగియ్యండొకసారి, యిప్పుడే పంపించేస్తా' అని కండక్టరు ఆ ప్రయాణీకుడి దగ్గర గొడుగు తీసికొని స్టాండులో నిలచిన వర్షపు నీళ్లలోంచి నడుచుకుంటూ మర్రి చెట్టుకిందికి కోటి దగ్గరకు వెళ్లాడు.

కండక్టరును చూడటంతోనే మూడడుగులు వెనక్కి తగ్గాడు కోటి.

'నేనేమీ చేయన్రా... తల్లితోడు... నేనేమీ చేయన్రా... తల్లితోడంటే నమ్మవా... రారా... ఇంద ఈ గొడుగు కిందికి రా... టిఫిన్ చేద్దువుగాని... రారా...'అని ప్రేమ ఒలికే తియ్యని పలుకులు వినబడేసరికి కోటికి ప్రాణమొచ్చినట్టు అన్పించింది. తల్లితోడు అని కండక్టరు ఒట్టు పెట్టుకుంటున్న మాటలమీద నమ్మకం కలిగింది. 'టిఫిన్ చేద్దువు గానిరా' అనేసరికి వాళ్లు అంత వరకు పెట్టిన హింసంతా మాయమైపోయింది.

జాలి చూపులు చూశాడు. దిక్కులేని చూపులు... ఆకలి చూపులు...

ఆ చూపులకు కండక్టరు మరింత కరిగిపోయాడు.

కాఫీ హోటల్‌లో ఎవర్నీ చూడలేదు కోటి. వెళ్లి కండక్టర్‌తో ఓ మూలనున్న టేబుల్ ముందు కూర్చున్నాడు.

కండక్టర్ ప్రేమతో అడిగి, కావలసినవన్నీ తెప్పించి బలవంతం చేసి, కడుపునిండా తినిపించాడు. కోటి కడుపు నిండిపోయింది. ఆకలి తీరిపోయింది. టీ

కూడా తాగి గ్లాసు టేబుల్ మీద పెట్టేశాడు కోటి. కోటీతో పాటు కండక్టర్ టీ తాగాడు.

డ్రైవర్ అంతలో హోటల్‌లో కండక్టర్, కోటి కూర్చున్న టేబుల్ దగ్గరకు వచ్చి "ఆ బాబు — గొడుగు కావాలంటున్నారు" అన్జెప్పి, కండక్టరు చేతిలో ఉన్న గొడుగును తనతో వచ్చిన వేరే యువకుడికి ఇచ్చేసి, కండక్టరు కోటికి టిఫిన్ తినిపించడం చూసి, కోటికి తనూ ఏమన్నా తినిపించాలనిపించింది. 'ఒరేయ్ కోటి... నావంతు నాలుగు పెరుగ్గారెలు — 'అని కోటి వద్దని తినలేనన్ని వారిస్తున్నా వినకుండా, సర్వర్‌ని పిలిచి ఆర్డర్ ఇచ్చి కోటి పక్కనే కూర్చున్నాడు.

డ్రైవర్‌కీ, కండక్టర్‌కీ కోటిమీద దయ కలగటానికి కారణాలు చాలా ఉన్నాయి. వాళ్లిద్దరిదీ ఈ ఊరుకాదు. అయితే వాళ్ల బస్సు నైట్ హాల్ట్ మాత్రం ఇక్కడనే. అందువల్ల వాళ్లు ఈ ఊళ్లో అద్దె ఇళ్లల్లో ఉంటున్నారు. వాళ్ల ఇళ్లల్లో పనుల్లో కోటి వాళ్లకు సహాయపడతాడు. బస్సునించి ఇళ్లకు పంపించే వస్తువులు ఏమన్నా ఉంటే అవి కోటికి అప్పజెప్తే బాధ్యతగా ఇంటికి చేర్తాయి. ఇంటివాళ్లు చెప్పమన్న కబుర్లు వాళ్లకు ఎప్పటికప్పుడు అందుతాయి. ఆ రకంగా వాడు ఈ ఊరు వచ్చినప్పటినించి ఆ స్టాండులోని బస్సుస్టాఫ్ వాళ్లకు పనికివచ్చేమనిషి అయ్యాడు. ఒక్కోసారి ఒక్కోరు వాళ్ల ఇళ్లకు భోజనాలకు తీసుకువెళ్తారు. లేకపోతే టిఫిన్‌కో, భోజనానికో చేతిలో పైసలు పెట్తారు. తాము తినేదాంట్లో కోటికి కొంచెంపెట్తారు. వాడు ఇక్కడకు వచ్చి దాదాపు ఏడాది కావస్తున్నది. బతుకు అక్కడే ఆ సిబ్బంది దయాదాక్షిణ్యాలతోనే గడుస్తున్నది. ఒక్కోసారి వారం పదిరోజులు ఏలారీలోనో, ఏడ్రైవర్ పిలిస్తేనో వాళ్లతో పోయి వస్తుంటాడు. వాడికి ఇల్లులేదు. వాకిలిలేదు. వాడికి ఎవరున్నారో, ఎవరులేరో తెలీదు. ఎవరికీ చెప్పలేదు. ఒక రూట్‌లో కండక్టరుగా నాలుగయిదేళ్లు చేశాడని మాత్రం వాళ్లకు కొంచెం ఆలస్యంగా తెలిసింది. తెలివైనవాడనీ అంతకన్నా మంచివాడనీ, అందరికీ తెలిసింది. భార్య చచ్చిపోయిందనీ, కొడుకు చచ్చిపోయాడనీ, తమ్ముడున్నాడనీ, తల్లి తమ్ముడి దగ్గరే ఉన్నదనీ, అన్నయ్యకూడా ఉన్నాడుగాని, పెద్ద ఉద్యోగహోదాలోనే ఉన్నాడు గాని, కుటుంబంతో ఆయనకు సంబంధం లేదనీ, వాళ్లంతా పక్క జిల్లాలోనే సుఖంగానే ఉన్నారనీ వాడెప్పుడూ ఎవరితోనూ చెప్పుకోలేదు. వాళ్లంతా ఉన్నా తనకు వాళ్లు లేనట్టే — భార్య చనిపోయినప్పుడే ఆ కోటేశ్వరరావు చనిపోయాడనీ, కొడుకు చనిపోవడంతో — ఇంక ఈ భూమ్మీద తనకు కావలసింది అంటూ ఏదీ మిగల్లేదనీ' — కోటి దేశాలు పట్టిపోయాడు. ఆ కథలన్నీ తవ్వడం ఇష్టంలేదు. ఆ దుఃఖాన్ని గుర్తు చేసుకోవటం కూడా ఇష్టం లేదు. అందుచేత తన కథ ఎవరికీ చెప్పుకోలేదు.

డ్రైవర్ బలవంతం చేస్తున్నాడు. పెరుగ్గారెలు టేబుల్ మీద ప్లేట్లో తెచ్చిపెట్టి వెళ్లాడు సర్వర్. ఆ హోటల్ పెరుగ్గారెలకు ప్రసిద్ధి. అయినా కడుపునిండి పోయింది. అమృతాన్నయినా నోట్లో పెట్టేట్టులేదు. 'కడుపు నిండిపోయింది. ఇంక తిన్లేను. వద్దు' అన్నాడు కోటి.

'సరి సర్లే. తిను తిను. తినకపోతే తంతాను జాగ్రత్త' అని అభిమానం కూడా మెత్తగా మంచిగా చెప్పలేని డ్రైవర్ బలవంతం చేస్తున్నాడు. బెదిరిస్తున్నాడు. తిట్టికొట్టి తన్ని ఎలాగయినా సరే ఆ పెరుగ్గారెలు తినిపించాలి అన్నట్టున్నాడు డ్రైవర్. విడిచిపెట్టే ఊరుకునేట్టులేడు, తింటుంటే డోకు వచ్చినట్లు అవుతున్నా తప్పక తింటున్నాడు కోటి.

వర్షం ప్రపంచాన్ని జలమయం చేసి ఆగింది.

కోటి తింటూ, తింటూ మధ్యలో డోకువచ్చేట్టయి హోటల్‌లోనే వాంతి చేసుకుంటే చూసినవాళ్లు తిట్టారని, బలవంతంగా అణచుకుని బైటకు వెళ్ళి, పంచన ఒక మూలగా నుంచుని తిన్నదంతా వాంతి చేసుకున్నాడు. డ్రైవర్ మగ్గుతో నీళ్లు తీసుకుని వెళ్లి ఇచ్చాడు కోటికి. మొత్తం ఇప్పుడు తిన్నదంతా కక్కేసుకున్నాడు. నోరంతా చేదుచేదుగా ఉంది. నరాలన్నీ వణుకుతున్నాయి. తలంతా నొప్పిగా ఉంది. కాళ్లు కంపించిపోతున్నాయి. నీరసంతో హోటల్ పంచన గోడకి చేరగిలబడి కూలబడ్డాడు.

బస్సు బయల్దేరే వేళయిందని కండక్టరూ డ్రైవరూ వెళ్లిపోయారు. వాళ్ల బస్సుకదిలి పోయింది. కృపాసింధుతో వాళ్లు ఏమో చెప్పినట్టున్నారు. ఆ బస్సు వెళ్లిపోయిన తర్వాత కృపాసింధువచ్చి కోటితో చాలాసేపు మాట్లాడాడు.

బస్సులు వస్తున్నాయి. జనం దిగుతున్నారు. కొత్త ప్రయాణీకులు బస్సుల్లో పోటీపడి నెట్టుకుంటూ లోపలికి పోతున్నారు. వర్షం ఆగుతున్నది. కురుస్తున్నది. ఆకాశం నల్లని మేఘాలతో నిండిపోయింది. సూర్యుడు కనిపించడంలేదు. కోటి హోటల్ పంచన అట్లాగే నిద్రపోయాడు. ఎంతసేపటికో నిద్రలేచాడు. ఇప్పుడు నీరసంగా ఉంది. అయినా బావుంది. ఆకలిగా ఉంది. అయినా తినాలనిలేదు. మంచినీళ్లు మాత్రం తాగాలని ఉంది. ఇక్కడ ఈ హోటల్‌లో మాత్రం నీళ్లుతాగాలని లేదు. దగ్గర్లో కృపాసింధు వాళ్ల ఇల్లే ఉంది. అక్కడకు వెళ్లి నీళ్లు అడిగి కడుపునిండా తాగాలని ఉంది.

వర్షం మళ్లీ చిన్నగా కురవటం మొదలయింది.

కొత్తగా వచ్చిన బస్సునించి దిగిన అరవైయ్యేళ్ల పెద్దవయసామె కనపడింది. ఆమె వానలో తడుస్తున్నది. ఆమెతోపాటు బరువుమూట ఒకటి ఉంది. ఆమెచేతిలో మరో చిన్నమూట ఉంది. ఆ చిన్నమూటను ఆమె గుండెలో దాచుకుంది. పెద్దమూట

తాను మోయలేదు. కనీసం హోటల్ పంచకు దాన్ని వెంటనే చేర్చాలి. కూలీలు ఎవరూ కన్పించలేదు. బస్సుస్టాండులో కిందంతా నీళ్లు... ఆ నీటిలోనే ఆ బరువు మూటని పట్టుకోలేక పెట్టబోయింది. ఆ మూట నీటిలో తడిసిపోయేట్టుంది.

కోటి ఆమెను చూశాడు. ఆమె పరిస్థితి చూశాడు. ఆ మూటను అందుకుని హోటల్ పంచకు తెచ్చిపెట్టాలనిపించింది. వెళ్లి ఆ మూట అందుకున్నాడు. 'రా అమ్మ రా. ఆ పంచలోకి రా' అని ఆమె కళ్లల్లోకి విచిత్రంగా, వింతగా, కొత్తగా, ఆశగా, భక్తిగా చూశాడు.

తనకు ఎన్నో జన్మలుగా తెలిసిన అమ్మలా అన్పించిందామె.

* * *

'స్రవంతి' సాహిత్యమాసపత్రిక